
# బియ్యపు గింజలో వడ్లగింజ

బెహరా సత్యవాణి



సీతామహాలక్ష్మి భరించలేని శిరోవేదనతో బాధ పడుతుందన్న వార్త తెల్లవారేసరికి ఆ గ్రామం అంతా పాకిపోయింది. ఆ వాడలో ఆ వార్తవిన్న తరుణీమణులందరూ తల్లడిల్లిపోయారు. వెంటనే వెళ్ళి ఆమెను చూడాలన్న తమ ఆవేదన్ను కూడా వ్యక్తం చేయాలనీ అనుకున్నారు. ఉదయాన్నే పనుల్లో మునిగివున్న పతులు అటు ఆమెను చూడలేక, ఇటు గృహకృత్యములు నెరవేర్చుకొనలేక విల విల్లాడిపోయారు. ఎలాగో ఖాళీ చేసుకుని కొంతమంది సీతామహాలక్ష్మిని కల్సి తమ ఆవేదననూ ఆందోళననూ వ్యక్తం చేసారు. ఆమె బాధలో కొంతపాలు పంచుకొన్నారు.

గవర్నమెంటు డాక్టరుగారి సతీమణి గౌరిదేవి భర్తను నిద్రలేపింది. విషయం వివరించింది. అర్ధాంగి అభ్యర్ధనవిని ఆ తర్వాత ఆమె పోరు పడలేక చటాల్ని మంచందిగి బీరువా తెరిచారు. అత్యంత పవరుగల ఆరు మాత్రలను అర్ధాంగి చేతిలో వుంచారు. మొదటి రెండు మాత్రలూ మింగగానే కాల్చిన వంకాయకి తొక్క వూడిపడినట్లు తలనొప్పి బయటికి వచ్చి పడుతుందని హామీ యిచ్చారు.

ఫారెస్టు రేంజరు భార్య పార్వతమ్మ వీధివరండాలో ఆదమర్చి నిద్రపోతున్న లబుడిగాడ్ని నిద్రలేపింది. అతికష్టం మీద అడవిలోకి పరుగు దీయించింది. పదినిమిషాల్లో పర్సాది ఆకును తీసుకుని రమ్మని ఆజ్ఞాపించింది. ఎదురింటి వెంకటరమణమ్మకి తలనొప్పి సీసాకోసం వెతికి వెతికి కాళ్ళు పడిపోయాయ్. అయినా ప్రయత్నం మానలేదు. నానాజీ బట్టలపెట్టిలోంచి బయటకు తీసి సీతామహాలక్ష్మి యింటికి పరుగెత్తింది మొట్టమొదటి విజిటరు కావాలని.

సీతామహాలక్ష్మి మినిష్టరుగారి మిసెస్‌కాదు. ఆఫీసరుగారి అర్ధాంగి అంతకన్నా కాదు. ఒకానొక ఆఫీసు గుమాస్తా భార్య మాత్రమే!

విశాఖజిల్లాలో ఆదొక ఏజన్సీ గ్రామం. చుట్టుపక్కలగల నలభై గ్రామాల కేంద్రం! గిరిజనాభివృద్ధికోసమూ, మలేరియా నిర్మూలన కోసమూ, ఆ గ్రామంలో అనేకానేక ఆఫీసుల్ని నెలకొల్పింది ప్రభుత్వం. ఇవికాక సబ్ పోస్టాఫీసూ బ్లాక్సుఆఫీసు వగైరాలున్నాయ్. తాలూకా కేంద్రం కూడా. ఆ గ్రామంలో రమారమి రెండు వందలమంది చిన్నా పెద్దా ప్రభుత్వోద్యోగు లున్నారు. ఉద్యోగులకోసం ఇళ్ళు నిర్మాణింపబడ్డాయ్. కాలనీలు ఏర్పడ్డాయ్. ఆ గ్రామ జనాభా మూడువేలకి మించి వుండదు. మన్యానికి నడిబొడ్డున వున్నా ఆ పల్లె జనాభాలో గిరిజనుల సంఖ్య ముప్పయిశాతానికి మించి వుండదు.

ఉదయం ఎనిమిది గంటలు దాటితేనే గాని సూర్యోదయం కాదు. సాయంత్రం అయిదుగంటలయేసరికి చీకటిపడుతుంది వేసవికాలంలో కూడా. అక్కడ ఎంటర్‌టైన్మెంటు అసలులేనే లేదు. నలభైమైళ్ళు బస్సు ప్రయాణం చేసి కొండ దిగితేనేగాని సినిమాహాలు కన్పించదు. అందుకే రెండు సంవత్సరాల క్రితం అక్కడి ఉద్యోగులందరూ కల్సి ఒక రిక్రియేషన్ క్లబ్‌ని ఏర్పాటు చేసుకున్నారు. ఉద్యోగులు సాయంత్రం అయిదు గంటలనుంచి ఏడూ, ఎనిమిది గంటలవరకూ అక్కడ కాలక్షేపం చేసి ఇళ్ళు చేరుకొంటారు.

పదిగంటలకల్లా వంట ముగించి భర్తలను ఆఫీసులకి సాగనంపుతారు. ఆ తర్వాత స్కూళ్ళనుంచి పిల్లలు వస్తారు. వారి భోజనాలు అయేసరికి పదకొండున్నరా పన్నెండవుతుంది. ఆ తర్వాత అందరికీ తీరుబడి. లైబ్రరీ నుంచి తెప్పించుకొన్న

పుస్తకాలతోనూ, రేడియోతోనూ కొందరు వనితలు కాలక్షేపం చేస్తారు. మరి కొంతమంది ఒకరింట సమావేశం అవుతారు పిచ్చాపాటి కబుర్ల కోసం, ఆ యిల్లే సీతామహాలక్ష్మి యిల్లు!

వారి కబుర్లు పనిమనిషి పోలమ్మ పొగరు మోతుతనంతో నడక మొదలుపెట్టి ఫారెస్టు రేంజరు లంచగొండితనం వరకూ పరుగెత్తి గెజిటెడాఫీసర్ల ట్రాన్స్‌ఫర్లు దగ్గర గంతులేసి ప్రధానమంత్రి విదేశ పర్యటన వరకూ ఎగుర్తాయ్.

పెళ్ళయి పదేళ్ళయినా కడుపు పండని పని మనిషి 'సద్దు' బ్రహ్మచారి మలేరియా యిన స్పెక్టర్ విశ్వనాథం యింట్లో పనికి కుదిరిన నెలకే నెల తప్పిందనీ – బ్లాకాఫీసు పియ్యే ప్రతిరోజూ రాత్రి బాగా తాగొచ్చి పెళ్ళాన్ని కొడతాడనీ–ఇద్దరు పెళ్ళాలున్న గిరిజన హాస్టలు వార్డెను హైస్కూలికి కొత్తగా వచ్చిన హిందీ టీచరమ్మతో సరసాలు మొదలుపెడుతున్నాడనీ – భర్త వేసక్టమీ చేయించుకొన్నా భారతమ్మ మళ్ళీ నెల తప్పిందనీ, పార్వతీబాయి చేయించుకొన్న పుస్తెలతాడు ఆమె చెప్పుకొంటున్నట్లు రెండు తులాలు కాదనీ, తులంన్నరే వుంటుందనీ – హైస్కూలు హెడ్మాష్టరుగారి కొత్తల్లుడు సంక్రాంతి పండక్కి రాకపోవడం హైదరాబాదు ట్రైనింగ్‌కి వెళ్ళడం కాదనీ, అతను కోరిన టూ-ఇన్-వన్ కొనివ్వక పోవడమేననీ— కంచిలో కామాక్షమ్మ కొనుక్కున్న పట్టుచీర అసలు పట్టు కాదనీ, ఆమె చెప్పుకొన్నట్లు ఆరు వందలు వుండదనీ...

ఇత్యాది కబుర్లతో వారి పరోక్షంలో అతి చాకచక్యంగా చెప్పి అక్కడ చేరిన అతివలనందర్నీ ఆకట్టుకుంటుంది సీతామహాలక్ష్మి.

అంతేకాదు ఆమెకు తెలియని ఆఫీసు విషయాలుండవ్.

ఎవరి మొగుడు ఎంతెంత లోన్లు తీసుకొన్నదీ, ఎంతెంత అడ్వాన్సులు పొందినది చెప్తుంది. డాక్టరుగారికీ డెప్యూటీ డైరక్టరుగారికీ అభిప్రాయ భేదాలు ఎలా వచ్చిందీ, ఎంతవరకూ వచ్చిందీ చెప్పగలదు. తన దారికి అడ్డు వస్తున్నాడని యూడీసీ అప్పారావుని తాసిల్దారే ట్రాన్స్‌ఫర్ చేయించాడనీ ఫారెస్టు రేంజర్ శామ్యూల్ శలవులో వుండటం కాదు సస్పెన్షన్‌లో వున్నాడనీ–బ్లాకాఫీసు మేనేజరుకి త్వరలో ప్రమోషన్ రాబోతోందనీ, సెరికల్చరు ఇనస్పెక్టర్ చిత్తూరు ట్రాన్ఫర్‌కి ట్రై చేస్తున్నాడనీ—ఇంకా అనేక విషయాలు చెబుతుంది సీతామహాలక్ష్మి.

ఆ విషయాలు ఆమెకు ఎలా తెలుస్తాయో ఎవరికీ తెలీదు. అక్కడకు చేరిన అతివలందరూ ఆశ్చర్యాంబుధిలో తేలి మునుగుతూ వుంటారు – వింటారు. వినోదిస్తారు. ఎప్పుడైనా తగువులూ తంటాలు వస్తే ఏ మాత్రమూ చలించదు సీతామహాలక్ష్మి. చాకచక్యంగా తప్పించుకొంటుంది – ఇతరులను తప్పిస్తుంది. అదే ఆమెలో స్పెషాలిటీ!

సీతామహాలక్ష్మి భర్త వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసులో యూ. డీ. అకౌంటెంటు. పేరు సీతాపతిరావు. అంతా సీతాపతిగారు అనే పిలుస్తారు. అయినా పలుకుతాడు. సీతాపతి అతి సౌమ్యుడు. పలకరిస్తేనే మాట్లాడుతాడు. ఏ చెడు అలవాట్లూ లేవు. వక్కపొడి కూడా తినడు. ఆఫీసు అయాక రిక్రియేషన్ క్లబ్‌కి పోతాడు. పార్టనర్ దొరికితే చదరంగం ఆడతాడు. లేకపోతే పేపరు చూసి అరున్నరకల్లా యిల్లు చేరుకొంటాడు.

సీతాపతి పనిచేసే ఆఫీసులోనే ఆఫీసు సూపర్నెంటు శశిభూషణం. రెండు సంవత్సరాల క్రితం ఆ గ్రామానికి ట్రాన్స్‌ఫర్ అయారు. రిక్రియేషన్ క్లబ్‌కి సెక్రటరీ. అందరితోనూ కల్పి కట్టుగా వుంటారు. నవ్వుతూ నవ్విస్తూ వుంటారు. క్లబ్ సెక్రటరీ కాబట్టి ఆయన యిల్లు చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలవుతుంది. శశిభూషణం గారంటే శశికళ భర్త. నలుగురు సంతానం. పెద్దబ్బాయి వాల్తేరులో ఎమ్-టెక్ చదువుతున్నాడు. రెండో అబ్బాయి ఇంజనీరింగ్ మొదటి సంవత్సరమూ మూడోవాడు ఇంటర్ బైపీసీ. ఆఖరి అమ్మాయికి పది సంవత్సరాలు. అయిదో క్లాసు. భర్తను కోల్పోయిన చెల్లెలును విశాఖపట్నంలో వుంచి పిల్లలకు చదువులు చెప్పిస్తున్నారు. జీతం తప్పించి వేరే సంపాదన లేదు. ఆస్తిపాస్తులు అంతకన్నా లేవు.

ఆరోజు రాత్రి భర్తను అడిగింది శశికళ.

"ఏమండీ! మొన్న ప్రావిడెంటు ఫండు అడ్వాన్సు రెండు వేలుతీసు కొన్నార్ట!" అని. 'నాతో చెప్పారుకాదేం?' అన్న ప్రశ్న ధ్వనించిందా కంఠంలో.

భార్య వైపు ఆశ్చర్యంగా చూసాడు శశిభూషణం ఎన్నడూ వూహించని ప్రశ్న అది! కాపరానికి వచ్చి ముప్పై సంవత్సరాలయినా ఎప్పుడు అలా అడగలేదు. తన జీతం ఎంత అని కూడా అడగలేదు!

"తీసుకొన్నారా?" మరలా అడిగింది శశికళ భర్తను సూటిగా చూస్తూ.

"నీకెవరు చెప్పారు?" ఆశ్చెరువు పోతూ తిరిగి ప్రశ్నించారు.

"నాకెవరు చెప్పిందీ వేరే సంగతి! తీసుకొన్నారా లేదా" భర్తను నిగ్గదీసింది.

ఆనాటి భార్య ధోరణి వింతగా తోచిందాయనకు.

"మన పిల్లలకి ఆస్తి పాస్తులు ఎలాగూ సమకూర్చలేం! బాగా చదివించండి! పెద్ద ఉద్యోగాలయినా వస్తాయ్! తండ్రిలా గుమస్తాలుగా ఆఫీసుకి అంకితం కాకూడదు. మనం ఎంత మిగిల్చినా పది పదిహేను వేలు దాటదు. అంతా అయాక ఆ డబ్బు పిల్లల్ని ప్రయోజకుల్ని చేయలేదండి. నాకు నగలుమీద మోజులేదు! ఎంత ఖర్చు అయినా వాళ్ళని ప్రయోజకుల్ని చేయండి చాలు! మీ సంపాదన ఎంత? ఎంత మిగులుస్తున్నారు? అని నేనెప్పుడూ అడగను!" అని అంటూ వుండే శశికళేనా ఇలా ప్రశ్నించేది?

గత సంవత్సరం పిల్లల్ని యూనివర్సిటీలోనూ కాలేజీలోనూ చేర్పించడానికి పుస్తకాలకీ బట్టలకీ డబ్బులేకపోతే భార్యను సంప్రదించారు శశిభూషణం. ఇన్సూరెన్సు పాలసీ మీద రెండు వేలు అప్పు తేదల్చుకున్నానని చెప్పారు.

"పాలసీ మీద లోను తెచ్చినా ప్రావిడెంటు ఫండు లోను పెట్టినా నాతో చెప్పనవసరం లేదండి! మీరు డబ్బుని దుర్వినియోగం చేయరని నాకు తెలుసు! మన పిల్లల బాగోగులు చూడడమే మన ధ్యేయం! వాళ్ళే మనకి ఆస్తి! ఆడపిల్ల పెళ్ళిదుకి వచ్చేసరికి పెద్ద వాళ్ళిద్దరూ అందొస్తారు. మీకెలా తోస్తే అలా చేయండి! మీకు సలహాలు యిచ్చేంతటి దాన్ని కాదు!" అన్న శశికళేనా ఇలా నిలదీసి అడుగుతుంది?

తన ప్రశ్నకి జవాబు చెప్పక పోవడంతో మరోసారి అడిగింది ఆవేశపడుతూ.

"చెప్పండి! అప్పుతీసుకున్నారా లేదా?"

"అవును! తీసుకున్నా!" అన్నారు అతి నెమ్మదిగా.

"తీసుకొన్నానని ఆ రోజే నాతో చెబితే ఏం పోయిందండి!" ఆవేశాన్ని అణచుకోలేక నెమ్మదిగా అనలేకపోయింది శశికళ.

"పిల్లల ఫీజులకీ పుస్తకాలకీ అవసరం వచ్చింది తీసాను!"

"ఎంత తెచ్చారనీ, ఏమి చేసారనీ నేనడగడం లేదండి! డబ్బు తెచ్చినట్టు నాతో చెప్పి వుంటే బాగుణ్ణు!"

భార్య పదే పదే అదేమాట అంటూంటే చీకాకు వేసిందాయనకు.

"మన పిల్లలు నాలాగే గుమాస్తాలు కాకుండా చూడమని అన్నావా లేదా?" అడిగారు.

"అవును!"

"నాకు నగలూ చీరలూ వద్దని-తెలివైన పిల్లలు కాబట్టి వాళ్ళకి పెద్ద చదువులు చెప్పించమని అనే దానివి జ్ఞాపకం వుందా?" రెట్టించారు.

"అవునండీ! ఇప్పటికీ నా కోరిక ధ్యేయం అవేనండి! మనపిల్లలు పెద్ద పెద్ద ఆఫీసర్లు కావాలి! ఆఫీసు గుమాస్తాలు కాకూడదు!"

"పిల్లల భవిష్యత్తు కోసం ఆర్జన అంతటినీ ఖర్చు చేస్తున్నాననీ ఆఖరి దశలో అవస్థలు పడ్తామని బాధపడుతున్నావా? లేక డబ్బుని దుర్వినియోగం చేస్తున్నాననీ, ఎవరికైనా యిస్తున్నాననీ దుర్వ్యసనాలకి ఖర్చు చేస్తున్నానని అనుమానిస్తున్నావా? చెప్పు శశీ! చెప్పు!" వుద్రేకపడ్డారు శశిభూషణం.

శశికళ కళ్ళలో నీరునిండుకొంది. భర్త మాటలకి విలవిల్లాడింది. స్వరం గద్గదమైంది.

"మీరు డబ్బుని పాడుచేస్తున్నారని కల్లో కూడా అనుకోనండి! నా ఆవేదన అది కాదండి!"

"మరి?"

"భార్యకు కూడా చెప్పకుండా వేలకు వేలు ఖర్చు చేసే మనిషని 'వారంతా' అనుకొంటూ వుంటే వినలేకపోతున్నానండి!"

అర్థాంగి ఆవేదనను అర్థం చేసుకొన్న శశిభూషణం తన వుద్రేకానికి వుచ్చు బిగించారు.

"సరే! ఇక ముందు చెబుతా!" అన్నారు అతి సౌమ్యంగా ఆమెను ఊరడించాలని.

"జమా ఖర్చులు చెప్పమని మిమ్మల్నాదేశించడం లేదండి! ఇంత తెచ్చాను! ఇలా చేస్తున్నాను అని చెబితే చాలు! నా అనుమతి తీసుకోనవసరం లేదు ఈ విషయం నాకు ముందుగా తెల్పి వుంటే–

"అవునండి! పిల్లల చదువులకి చాలా డబ్బు ఖర్చు అవుతుంది! జీతం చాలడంలేదు. ఎక్కడో ఎవరిదగ్గరో అప్పుతెచ్చి వడ్డీల వుచ్చులో యిరుక్కోవడం యిష్టం లేక యిలా చేస్తున్నాం! నా పిల్లలు యింజనీర్లూ, డాక్టర్లు కాబోతున్నారని సగర్వంగా చెప్పి వాళ్ళ నోరుమూయించి వుండే దాన్ని! దాంతో వాళ్ళు కుళ్ళి కుళ్ళి యేడ్చేవారు."

ఆనందాశ్రువులతో భార్య తనవైపు చూస్తూంటే, ఆమె చెక్కిలిమీద జారిన నీటిబిందువుల్ని తుడిచారు శశిభూషణం.

పెద్ద తుఫాను వెలరేగుతుందని మొదట్లో భయపడ్డా తృప్తిగా, గ్వాశ వదిలారు.

"సీతామహలక్ష్మిగారింటికి వెళ్ళావా?" అడిగారు.

"ఆమె యింటికి ఎప్పుడో గాని వెళ్ళనని మీకు తెల్సుగా! సాయంత్రం డాక్టరుగారింటికి పేరంటానికి వెళ్ళి వస్తూంటే దారిలో యింటికి రమ్మని పట్టుబట్టింది సీతామహలక్ష్మి చాలా రోజులయింది కదా అని వెళ్ళాను అందరిముందూ ఈ ప్రస్తావన వచ్చింది."

"నువ్వేం అన్నావ్?" అడిగారుకుతూహలంగా.

"డబ్బు విషయంలో మావారిని నేనేమీ అడగనండి! నాతో చెప్పటోయినా ఆ విషయాల్తో సంబంధం లేనట్లుంటాను! పిల్లల చదువులకి బోలెడు డబ్బు కావాలి! మాకేం ఆస్తి పాస్తుల్లేవు....ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటూ వుంటాం! అన్నా!"

భార్య సమయస్ఫూర్తికి సంతసించారు.

"బాగా చెప్పావ్! ఇంకెప్పుడూ యిలాంటి విషయాలు నీదగ్గరెత్తరు!" అభినందించారు.

"నాదగ్గర ఎత్తరండి! ప్రతిరోజూ ఎవరి మీదనో ఒకరిమీద చెప్పుకొని ఆనందించడం అలవాటు అక్కడ చేరిన వాళ్ళకి! అందుకే తప్పనిసరి అయితేగాని అక్కడికి వెళ్ళను! అందరిలా అస్తమానం అక్కడకు వెళ్ళనని వారికక్కసు!"

ఆ క్షణంలో సీతాపతిరావు మీద పట్టరాని కోపం వచ్చింది శశిభూషణానికి వెంటనే వెళ్ళి అడగాలనిపించింది. విచక్షణాజ్ఞానాన్ని కోల్పోలేదు కాబట్టి కోపాన్ని అణుచుకున్నారు, అతి కష్టం మీద.

ఎవరు ఎంత డబ్బు తీసుకొంటే అతని కెందుకు? ఆఫీసు పనుల్లో ఎన్నో విషయాలు తెలుస్తూ వుంటాయ్. వాటిని బయటకు చెప్పడం అందులో ఆడవాళ్ళతో! ఎంత సంస్కార హీనుడు. అర్థాంగికి అవిధేయులుగా వుండేవారి సంఖ్య అల్పంగా

## దుందుభి దీపావళి

కొత్త అల్లుళ్ళ కోర్కెలకు
యెటా దిగివచ్చే దైవం!
కోడళ్ళ కన్నవాళ్ళకో—నువ్వు
జడిపించే కొరవి దయ్యం!!

నీరాకకు
తోరణాలు కట్టాలని
నీకోసం
హారతులెత్తాలని
అమాయకంగా అరులు చాచేవాళ్ళకు

నువ్వు పెరిగే అప్పుల భారం
తరగని బాధల అంబారం!
నీ నామం వసంతగానం
అగమనం స్వర్ణకవాటం
ఎవరికి?

మామూలు మనిషికికాదు–
దోపిడీచేసే ఘరానా దొంగలకు!

మాకుమాత్రం నువ్వు–
పక్కింటి నుంచి అరువుగా తెచ్చుకున్న
ప్రత్యేక సంచికల్ని
ఆవురావురుమని చదివి పారేసే
సర్వసాధారణమైన దినం.

వెనకటికెప్పుడో
నరకాసుర సంహారంలో
భర్తకు బాసటగా నిలిచిన
భార్య శౌర్య సంతకమే
దీపావళిగా వికసించిందట!

అందని ధరలు
అదుపులేని దుండగాలు
కమ్ముకొస్తూన్న దురాగతాలు
నరకాసుర కోరల్లా విచ్చుకుంటూన్న
ప్రస్తుత ప్రపంచంలో–

ప్రతి ఇంతి జరుపుతోంది
'నరకాసుర' సంగ్రామం
జరగలేదు నరకాసుర సంహారం
వెలగలేదు దీపావళి నిజం, నిజం
లేదు లేదు మన దుందుభి శబ్దంలో
నాదం

—బాల

వుంటే వుండొచ్చు। ఇతరుల సంసారానికి సంపాదనకి సంబంధించిన విషయాలు భార్యతో చెప్పాల్సిన అవసరం ఏమొచ్చింది? మర్నాడు ఆఫీసులో అందరి ముందూ అడగాలని నిశ్చయించుకొన్నారు. అటువంటి వానికి తగు గుణపాఠం నేర్పాలని అనుకొన్నారు.

మర్నాడు ఆఫీసులో అడుగు పెట్టిన మరుక్షణం నుంచీ సీతాపతిరావును గట్టిగా అడిగి మందలించాలనే అనుకున్నారు. కానీ సంస్కారం అడ్డు తగిలింది. అందరి ముందూ అతన్ని చిన్నబుచ్చే ఆలోచనను విరమించుకొన్నారు.

సాయంత్రం అయిదు గంటలయింది. ఉద్యోగులందరూ తనతో చెప్పి ఆఫీసు వదలి వెళ్తున్నారు, సీతాపతిరావు కూడా "వస్తాన్సార్।" అనేసి అడుగు వేయబోయాడు రోజులా.

"మీరుండండి సీతాపతిరావుగారూ। కొంచెం పని వుంది।" అనడంతో ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు సీతాపతి. టేబిల్ పైనున్న న్యూస్ పేపరు హెడ్డింగ్సు చూడనారంభించారు. ఆఫీసు తలుపులన్నీ వేసి సూపర్నెంటు శశిభూషణంకు ఎదురుగా నిలబడ్డాడు వాచ్‌మేన్ వీరయ్య. వారిద్దరూ కూడా బయటకు వెళ్తే ఆఫీసు మెయిన్ గేటుకు తాళాలు వేయడానికి.

వీరయ్య ఎందుకు నిలబడ్డాడో గ్రహించారు శశిభుషణం. వాడిని కొంతసేపు బయటకు పంపాలి.

"గడ్డపారలు బ్రహ్మనికిచ్చి వారం రోజులైంది. తయారయ్యాయేమో కనుక్కో నిరా।"

వీరయ్యకు పని పురమాయించారు.

ఆఫీసులో సీతాపతి శశిభూషణం యిద్దరే వున్నారు. ఆలస్యాన్ని భరించలేక లేచినిలబడ్డాడు సీతాపతి.

"చెప్పండి సార్। ఏమైనా పనుందా?" అడిగాడు.

శశిభూషణం మొహం జేవురించింది.

"ఎన్నాళ్ళనుంచీ మీకీ విషయం చెప్పాలనుకొంటున్నా సీతాపతిగారూ। కానీ యిప్పటివరకూ సమయమూ సందర్భమూ కలిసి రాలేదు।" అని ఆగారు.

"చెప్పండిసార్।" అడిగాడు అతి వినయంగా.

చెప్పడం మొదలు పెట్టారు.

"ఒక పెద్ద ఆఫీసరుకు అసిస్టెంటుగా మనం ఆఫీసులో వ్యవహరిస్తాం। ఆఫీసు వ్యవహారాల్లో మనకెన్నో విషయాలు తెలుస్తూ వుంటాయ్। ఎవరికి చార్జిషీట్ యివ్వబడబోతోందో, ఎవరి మీద ఎంక్వయర్ ఆర్డరు వేయబడిందో, ఎవరికి ట్రాన్స్ఫర్ అయే సూచనలు వున్నాయో, ఎవరెవరికి ఎంతెంత లోన్సూ అడ్వాన్సు శాంక్షన్ అయ్యాయో ఎవరెవరికి రిజెక్టు అయ్యాయో, ఏ కంట్రాక్టరు ఎస్టిమేట్ ఎప్రూవ్ అయే అవకాశం వుందో మొదలైన విషయాలు మనకెన్నో ముందుగానే తెలుస్తాయి. వాటిని ముందుగానే బయట పెట్టడం మంచిది కాదు. ఆ కుర్చీలోంచి లేచి బయటకు రాగానే అన్నీ మర్చిపోవాలి। ఏమీ తెలియనట్లుగా వుండాలి. వుయ్ హవ్ టూ మెయిన్టైన్ అండ్ కీవప్ సర్టన్ అఫిషియల్ సీక్రెట్స్। ఏమంటారు?" అని అడిగారు.

శశిభూషణం యిచ్చిన వుపోద్ఘాతం ఎందుకో దేనిగురించో అర్థం కాకపోలేదు సీతాపతిరావుకి.

"ఎస్సార్।" అన్నాడు వారి మొహంలోకి చూడలేక నేల చూపులు చూస్తూ.

"మరి మీరు చేసిన పనేమిటి? నేను అడ్వాన్సు తీసుకున్నానని మన కాలనీ అంతా ఎలా తెల్సింది? మీకూ నాకూ ఆఫీసరుగారికి తప్ప యితరులకి తెలియడానికి ఆస్కారం లేదు।" కుపితులయ్యారు.

సీతాపతిరావు తలెత్తలేకపోయాడు.

"అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ సర్।"

ఆ మాటల్లో పశ్చాత్తాపం ధ్వనించింది.

"సారీ। అని ఒక మాట అంటే సరిపోతుందనుకున్నారా? పదిహేను సంవత్సరాలు సర్వీస్ పుటప్ చేశారు। ఏ సంగతులు ఎవరితో చెప్పాలో ఎవరితో చెప్పకూడదో తెల్సుకోకపోతే ఎలా?"

"అదికాదు సార్। మీ వాళ్ళు పట్టుచీర కొనుక్కోవాలని చాలా కాలంగా అనుకుంటున్నార్ట। బహుశ ఈ డబ్బుతో పట్టుచీర కొనుక్కొంటారేమో అని మా వాళ్ళతో అన్నా।" నీళ్ళు నమిలాడు సీతాపతి తలెత్తకుండానే.

"నా డబ్బుతో పెళ్ళానికి పట్టు చీర కొంటానో పట్నం పోయి జల్సా చేసుకుంటానో అది యితరులకు అనవసరం। ఇలాంటి విషయాలు ఆడవాళ్ళతో చెబితే ఎన్నో అనర్థాలకి దారి తీస్తాయి. కాపురాలు కూలినా కూలొచ్చు। తొందరపాటుతో కొందరు ప్రాణాలని పోగొట్టుకుంటారు। నా విషయం తెలిసినందువల్ల నాకేం కష్టం గానీ నష్టం గానీ కలగలేదు. ఈ అలవాటుకి మీరు స్వస్తి చెప్పాలి। అయామ్ సారీ।" అతి కటువుగా వచ్చాయి మాటలు.

"నన్ను క్షమించండి సార్।"

తలెత్తలేకపోయాడు సీతాపతి.

అంతలో వాచ్‌మేన్ వీరయ్య రావడంతో వారి మాటలు ఆగిపోయాయి. ఆ క్షణంలో వీరయ్య ఆపద్బాంధవునిలా తోచాడు సీతాపతికి.

"మీరిక వెళ్ళండి।" అని సూపర్నెంటు అనడంతో మరుక్షణంలో ఆఫీసు నుంచి బయటపడ్డాడు సీతాపతి. వంచిన తలయెత్తకుండా, ఎటువైపూ చూడకుండా తిన్నగా యింటి దారి పట్టాడు.

మర్నాడు భళ్ళున తెల్లవారింది.

సీతామహాలక్ష్మి భరించలేని శిరోవేదనతో బాధపడుతుందన్న వార్త ఆ గ్రామం అంతా పాకిపోయింది. □

## వనిత మాటల కొలువు — 87

సరైన సమాధానం :

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మ | ధు | 14 ర | 15 వా | ణి | ■ | 2 హి | 16 రా |
| ను | ■ | 3 త | ఢి | ■ | 4 త | మాం | ధా |
| స్మృ | ■ | ము | ■ | 6 ము | ర | స | శ |
| 8 తి | మ్మ | న | ■ | 7 ళ్లు | వా | ■ | ము |
| ■ | ■ | ■ | 17 చూ | ■ | 5 యి | 18 బో | ■ |
| 9 ము | 19 న | మా | లా | 20 తు | ■ | 10 జి | 21 వే |
| 11 గో | డ | ■ | 12 లు | ల | 22 క | ■ | కు |
| ■ | క | ■ | ■ | 13 సి | ను | గొ | వ |

ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసిన వారు పదిహేనుమంది. వారు :

1. పి. రంగమణి, పాల్వంచ 2. పి. లక్ష్మి, పాల్వంచ 3. ఆర్. దీప, కోరగుంటపల్లి 4. డి. శిరీష, వికారాబాద్ 5. జి. గిరిజ, కావలి 6. ఎమ్. కల్యాణి, వరంగల్ 7. జి. హైమవతి, శ్రీరంగపూర్ 8. ఎ. రత్నకుమారి, నందివెలుగు 9. ఎ. సూర్యకుమారి, విజయవాడ 10. పి. పద్మలత, న్యూ పాల్వంచ 11. బి. అచ్చాయమ్మ, తెనాలి 12. ఓ. శకుంతలాదేవి, సింగరాయకొండ 13, ఎస్. మాధవీలత, మడమనూరు 14. డి. పద్మారాణి, గోదూరు 15. డి. రమాదేవి, గోదూరు.

**బహుమతి మొత్తం రూ. 150 లు వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.**